
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4, కనిష్ఠం 24.0
నిజామాబాద్
జిల్లా వార్తలు
ఆదివారం 14 జూలై 2024





» రైస్‌మిల్లుల్లో రాష్ట్రస్థాయి బృందాల ఆధ్వర్యంలో మిల్లుల తనిఖీలు
» జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వకుండానే వస్తున్న బృందాలు
» తనిఖీలతో మిల్లర్లలో మొదలైన ఆందోళన

రైస్‌మిల్లుల్లో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

నిజామాబాద్, జూలై13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైస్‌మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని కీలక మిల్లుల్లో ఈ అధికారులు తనిఖీలను చేస్తున్నారు. గత మూడు సీజన్లలో ఇచ్చిన ధాన్యం కేటాయింపులను పరిశీలిస్తున్నారు. తేడాలున్న మిల్లులను పరిశీలించడంతోపాటు ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఈధాన్యం కేటాయింపుల వ్యవహారం, పక్కదారి పట్టిన పట్టించుకోకపోవడంతో కీలకమైన అధికారులను బదిలీచేశారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా బియ్యాన్ని ఇవ్వని మిల్లులకు నోటీసులు ఇచ్చారు. కొన్ని మిల్లులపైన కేసులను నమోదు చేశారు. కస్టం మిల్లింగ్ కింద బియ్యం వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో సమీక్షిస్తున్న అధికారులు జిల్లామిల్లులపై ఆకస్మికంగా ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయి ధాన్యం లేని మిల్లులపైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

• రెండో రోజులుగా తనిఖీలు

జిల్లాలో గత రెండురోజులుగా రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహన్ ఆదేశాల మేరకు జిల్లాలోని రైస్‌మిల్లులో తనిఖీలు కొనసాగుతున్నాయి. పౌరసరఫరా శాఖలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన రెండుబృందాలు జిల్లాకు వచ్చి రెండు రోజులుగా ఈ తనిఖీలను చేస్తున్నారు. రైస్‌మిల్లులకు గత మూడు సీజన్‌లో కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్నారు. ఏ మిల్లుకు ఎంత మొత్తంలో కేటాయించారో వివరాల ఆధారంగా మిల్లుల్లో తనిఖీలను కొనసాగిస్తున్నారు. ధాన్యం బస్తాలను పరిశీలించడంతోపాటు పూర్తిస్థాయిలో వివరాలను తీసుకుంటున్నారు. జిల్లాలో 2022 యాసంగి, 2023 వానాకాలం, యాసంగికి కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్నారు. జిల్లాలోని ఖానాపూర్, గుండారం, మాధవనగర్ ప్రాంతాల్లోని ప్రధానమిల్లుల్లో ఈ తనిఖీలను చేశారు. రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకొని పెద్ద మిల్లుల్లోనే ఎక్కువ మొత్తంలో తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి అనుగుణంగా కస్టం మిల్లింగ్ కింద బియ్యం ఎఫ్‌సీఐకి అందించని ఈ మిల్లులపైన ముందుగా తనిఖీలను చేస్తున్నారు. మిల్లుల్లో తనిఖీలను ఆపాలని, గత సీజన్‌లకు సంబంధించి కొంతఅవకాశం ఇస్తే బియ్యాన్ని, ధాన్యాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అసోసియేషన్‌కు సంబంధించిన ప్రతినిధులు కొన్నిరోజుల క్రితం రాష్ట్రస్థాయిలో అధికారులను కలిశారు. అవకాశం ఇవ్వాలని కోరారు. మిల్లర్లకు కేటాయించిన ధాన్యం వందల కోట్లలో ఉండటం ఇప్పటివరకు కేటాయింపులు చేయకపోవడం ధాన్యం ఎక్కువగా పక్కదారి పట్టడంతో ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు.

• రూ.220 కోట్లకుపైగా ధాన్యం పక్కదారి?

నాలుగు నెలల క్రితం జిల్లాలోని మెజార్టీ మిల్లుల్లో తనిఖీలుచేశారు. సుమారు 25మిల్లుల వరకు నోటీసులు ఇచ్చారు. కొన్ని మిల్లులపైన కేసులను కూడా నమోదు చేశారు. ఈ మిల్లులకు సంబంధించి 220 కోట్లకు పైగా ధాన్యం పక్కదారి పటినట్టుగా గుర్తించారు. జిల్లాకు చెందిన ఇద్దరు కీలకమైన అధికారులను బదిలీ చేశారు. ధాన్యం కేటాయింపులో నిర్లక్ష్యంగా ఉండటం కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని నిర్ధిష్ట సమయంలో వచ్చే విధంగా చూడకపోవడం, ధాన్యం పక్కదారి పట్టిన చర్యలు చేపట్టకపోవడం వల్ల వారిపైన వేటు వేశారు. కొత్త అధికారులను కూడా నియమించారు. అప్పటి నుంచే మిల్లర్లలో కొంత వణుకు రావడంతో పాటు పక్కదారి పట్టిన ధాన్యానికి సంబంధించి డబ్బులను కూడా చెల్లిస్తామని కొంతమంది మిల్లర్లు పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కలిసి విన్నవించారు. ఇతర జిల్లాలో ఇచ్చిన విధంగానే తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. కొంతమంది మిల్లుల యజమానులు మాత్రం తగిన సమయం ఇస్తే ధాన్యం నిల్వలతోపాటు బియ్యాన్ని అందిస్తామని విజ్ఞప్తిచేశారు. సమయం ఇచ్చినా మిల్లుల యజమానుల నుంచి పూర్తిస్థాయిలో స్పందన లేకపోవడంతో తమ పరిధిలోని టీమ్‌లను జిల్లా అధికారులకు తెలియకుండానే తనిఖీలకు పంపిస్తున్నారు. వారు రైస్‌మిల్లులకు చేరుకున్న తర్వాత జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి టెక్నికల్‌కు సంబంధించిన ఉద్యోగులను తనిఖీల కోసం రావాలని కోరుతున్నారు. మిల్లుల్లో మూడుసీజన్‌లకు సంబంధించిన ధాన్యం నిల్వలను పరిశీలిస్తూ అధికారులు ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు.

• సివిల్ సప్లై అధికారులకు తెలియకుండానే తనిఖీలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలియకుండానే తనిఖీ బృందాలు వస్తుండటంతో వారిలోనూ ఆందోళన కొనసాగుతోంది. మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేయడంతో ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో తనిఖీ బృందాలు ముఖ్యమైన నేతలకు సంబంధించిన మిల్లుల్లో ఈ తనిఖీలు చేస్తుండటంతో ఏం జరుగుతుందోనని వారు వేచి చూస్తున్నారు. పౌరసరఫరాలశాఖ తరఫున కేటాయించిన ధాన్యానికి సంబంధించి నిల్వలతోపాటు బియ్యం కేటాయింపులు చేయని మిల్లులపైన ఈ తనిఖీల ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రస్థాయి బృందాలుతనిఖీ చేస్తుండటంతో వారు ఇచ్చే నివేదిక ఆధారంగా కమిషనర్ ఆధ్వర్యంలోనే నిర్ణయం తీసుకుంటారని వారు చెప్తున్నారు. తనిఖీలు ఇంకా కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.







తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



టీయూ బాలికల హాస్టల్ ఇదే..

బాలికల హాస్టల్ నిర్మాణం ఎప్పుడో?

- తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు వసతి కరువు
- ఒకే భవనంలో 500 మంది
- 300 మందికి సరిపడే భవనంలో 500 మందికి వసతి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

డిచ్‌పల్లి, జూలై13: రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికీ తీరడం లేదు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కారం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత ఐదేళ్లుగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు 100 శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హాస్టల్‌లోని ఒక్కో గదిలో ఐదుగురి నుంచి ఆరుగురు ఉండాల్సి ఉండగా 10నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1226 మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతోంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

• 300 మంది కోసం నిర్మించిన హాస్టల్‌లో 500 మంది

గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని, దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వవిద్యాలయానికి అప్పటి రాష్ట్రగవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించిన సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు హాస్టల్ వసతి నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా మంజూరు కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.

• మంజూరు పత్రాలు అందినా నిర్మాణం చేపట్టలే..

తెలంగాణ యూనివర్సిటీకి గతంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలుర, బాలికల హాస్టల్ నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు అయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి హాస్టల్ నిర్మాణం కోసం మంజూరు పత్రాలు సైతం అందుకున్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణ పనులు మొదలుకాలేదు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా హాస్టళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

• రూసా నిధుల నుంచి రూ.8 కోట్లు..

రూసా నిధుల నుంచి 8కోట్లు బాలికల హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయిన ఇంత వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే శంకుస్థాపన ఉంటుందని పేర్కొంటున్నారు. త్వరగా శంఖుస్థాపన చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థునులు వేడుకుంటున్నారు.



కొత్తపల్లిలో ఊరేగింపునకు సిద్ధమైన పీరీలు

ముప్కాల్‌లో ప్రారంభమైన పీరీల పండుగ

ముప్కాల్, జూలై13: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పీరీల పండగ సంబరాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు పీరీల పండగను హిందు, ముస్లీం తేడా లేకుండా అందరూ కలిసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అనవాయితీగా వస్తున్న పీరీల మొక్కుబడులను తీర్చుకోవడానికి కొందరు చందాలు వేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. హిందువుల, ముస్లిములు అనే తేడా లేకుండా అందరూ వచ్చి పీరీలకు మలిద బెల్లాలను సమర్పించి పిల్లపాపలతో పాడి పంటలతో చల్లంగా ఉండాలని మొక్కులు తీర్చుకు న్నారు. రాత్రి వేళల్లో కులమతలకు అతీతంగా అలైబలై ఆడుతూ అగ్నిగుండం నుంచి నడిచి ఉత్సహంగా జరుపుకుంటారు. గ్రామంలో వారం రోజుల పాటు పండగ వాతావరణం నెలకొంటుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

- 'మధ్యాహ్న భోజనంలో పురుగులు' కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు
- మధ్యాహ్న ఏజెన్సీని మార్చాలని డీఈవో ఆదేశాలు

నిజామాబాద్ అర్బన్, జూలై 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో ఎన్.వి. దుర్గాప్రసాద్ ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'మధ్యాహ్న భోజనంలో పురుగులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కోటగల్లిలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నంతోపాటు నీళ్లచారు, ఉడకని కూరగాయలు పెట్టడంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ మార్చేందుకు మండల విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి. దుర్గాప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ పూర్తిగా విఫలమైందని, ఏజెన్సీని మార్చాలని ఎంఈవోను ఆదేశించారు. భోజనానికి సరఫరా అయిన నాణ్యతలేని బియ్యాన్ని మార్చాలని సివిల్ సప్లై అధికారిని కోరినట్లు డీఈవో తెలిపారు.



క్రీడామైదానం కబ్జా!

» అక్రమార్కుల చూపంతా 106 సర్వే నెంబర్ వైపే » గతంలో కూడా క్రీడామైదానం కబ్జాచేసేందుకు యత్నం
» మరోసారి క్రీడామైదానాన్ని చదును చేసిన ఓ రాజకీయ నేత » కబ్జాను ఆపాలంటున్న ఒలంపిక్ అసోసియేషన్

సుభాష్‌నగర్, జూలై 13: నగరంలోని గంగస్థాన్‌ల్లో గల క్రీడామైదానంపై కోబ్జాకోరుల కన్నుపడింది. కొందరు ఈ మైదానంలోని ప్రాంగణాన్ని చదును చేసి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదువలేకున్నా మైదానాలు మాత్రం కరువయ్యాయి. జిల్లావ్యాప్తంగా మండలానికి ఒక్కటన్న మైదానం ఉండడం లేదు. నగరంలో నాగారం స్టేడియం మినహా మైదానాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖలీల్‌వాడి మైదానం కూల్చివేసి ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించింది. ఖలీల్‌వాడి మైదానం కూల్చివేతతో అప్పటి ప్రభు త్వం గంగస్థాన్ ప్రాంతంలో ఏడు ఎకరాల స్థలాన్ని క్రీడామై దానం కోసం కేటాయించింది. అప్పటి ఒలంపిక్ అసోసియేష న్ సభ్యులు క్రీడామైదానం కోసం ప్రభుత్వ పెద్దలతో మంత నాలు జరిపి క్రీడామైదానానికి స్థలం సాధించడంలో తమ వంతు పాత్రపోషించారు. క్రీడామైదానంతోపాటు ఒలంపి క్ అసోసియేషన్ భవనం కోసం సుమారు 800 గజాల ను కేటాయించింది. ప్రస్తుతం ఈ స్థలం కబ్జాదారుల కన్నుల్లో పడింది. గతంలో కూడా ఈ స్థలంపై కబ్జా దారులు కన్నువేసి కబ్జాకు యత్నించగా ఒలంపిక్ అసోసియేషన్‌తో పాటు పలు క్రీడా సంఘాలు స్థలం వద్దనే టెంట్‌వేసి నిరసనకు దిగారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వ్యక్తుల సహాయంతో కబ్జాకు పాల్ప డిన అన్ని క్రీడా సంఘాలు ఒక్కటై క్రీడా మైదానాన్ని కాపాడు కున్నాయి. గత కొంతకాలంగా క్రీడా సంఘాలు ఒలంపిక్ అసోసియేషన్ కార్యకలాపాలు స్తబ్దుగా ఉండడంతో మళ్లీ కబ్జాదారులు క్రీడామైదానంపై కన్నువేశారు. క్రీడామైదాన ప్రాంగణాన్ని చదును చేసి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవు తున్నారు. ఇదితెలుసుకున్న ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు కబ్జాను అడ్డుకున్నారు.

• కబ్జాదారుల కన్నంతా సర్వేనెంబర్ 106 వైపే..

నగరంలోని అతి ఖరీదైన ప్రాంతం గంగస్థాన్. గంగస్థాన్‌కు ఆనుకుని 106 సర్వేనెంబర్‌లో సుమారు 36 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో మంచినీటి ట్యాంకు ప్రభుత్వ అవసరాలకు ఇవ్వగా పోను సుమారు 24 ఎకరాలు ఉండేది. అందులో మైదానం కోసం ఏడు ఎకరాలు కేటాయించారు. మిగతా స్థలం మొత్తం కబ్జాదారుల చే తుల్లోకి మారుతోంది. ఇప్పటికే కబ్జాదారులు ఇంటిపత్రాలతో పాటు ఇతర నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ప్రభుత్వభూమిని కబ్జాకు యత్నించారు. గతంలో ఉన్న అధికార పార్టీ నాయకులతో పాటు చోటామోటా నాయకులు సైతం కబ్జాలకు పాల్పడ్డారు. ఒలంపిక్ సంఘం నాయకులు కబ్జాకు గురవుతుందని వెళ్లగా అక్కడ కబ్జా చేస్తున్న రాజకీయ నేత తాను ఈ భూమిని కొన్నానని, తన వద్ద పత్రాలు ఉన్నాయని చెప్పడంతో ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు అవాక్కయ్యారు. ప్రభుత్వ స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ప్రశ్నించారు. దీంతో రాజకీయ నేత అక్కడి నుంచి పరారయ్యాడు.

• కబ్జాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ఒలంపిక్ అసోసియేషన్ భవనంతో పాటు మైదానం కోసం కేటాయించిన 7ఎకరాల భూమిపై ఒలంపిక్ అసోసియేషన్ నాయకులు ఉన్నతాధికారులు ఫిర్యాదుచేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి స్థలం కబ్జాపై వినతిపత్రం అందజేశారు. గతంలో కూడా ఓ అధికార పార్టీ నేత కబ్జాకు యత్నించగా అడ్డుకున్నామని, మళ్లీ కబ్జాకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 106 సర్వేనెంబర్‌లో అనేక ఎకరాలు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం కబ్జాచేసిన వారిపై తూతూ మంత్రంగా కేసులు నమోదుచేసి చేతులు దులుపుకున్నారని, కబ్జాకోరులపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేసేవరకూ ఉద్యమిస్తాం

• బొచ్చిలి నర్సయ్య, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి

గతంలో అధికార పార్టీకి చెందిన నాయకులు గంగస్థాన్‌లో గల ఒలంపిక్ భవనాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు. అసోసియేషన్‌గా మేము ఎదిరించాము. మళ్లీ కబ్జాకు చేసేందుకు కొందరు కబ్జారాయుళ్లు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఒలంపిక్ సంఘం భవనం కోసం కేటాయించిన స్థలాన్ని మైదానం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలి. క్రీడామైదానం ఏర్పాటు చేయాలి. లేకుంటే ఆందోళన నిర్వహిస్తాం.

వర్షాలు కురవాలని పూజలు

జక్రాన్‌పల్లి, జూలై13: పుష్కలంగా వర్షాలు కురువాలని శనివారం మండలంలో దేవునితోటలో వీడీసీ అధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి అల యం లో పూజలు చేశారు. వరుణదేవుడు కరుణించాలని పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ముప్కాల్, జూలై13: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ సంగవి రాజు అన్నారు. బాల్కొండ మండల కేంద్రం లోని పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆశలతో పంపిస్తారని, తల్లిదండ్రుల ఆశయాలను వమ్ముచేయకూడదన్నారు. చిన్నస్థాయి నుంచే విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో పాటు విద్యను బోధించాలని సూచిం చారు. ఉపాధ్యాయులు బోధించడం వల్లే విద్యార్థులు ఎదిగి వివిధ రంగాల్లో స్థిరపడతారని, వారు చిన్ననాటి ఉపాధ్యాయులు బోధించినవి ఇప్పటి వరకు గుర్తుంచుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మురళీ, శ్రీవాస్తవ, విజయ్‌సారథి, సంపత్‌కుమార్, తోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, విజయకర్తన్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

బోధన్ రూరల్, జూలై 13 : బోధన్ పట్టణంతో పాటు ఎడపల్లి, బోధన్ మండలాల్లో ఉన్న సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ తెలిపారు. ప్రతి నెల 2వ శనివారం సబ్‌స్టే షన్‌లలో మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బం దులకు కలగకుండా నిరంతరం విద్యుత్ అందించాలన్న ఉద్దేశంతో ఎప్ప టికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులు, ప్రజలకు వి ద్యుత్ సమస్య ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించా లన్నారు. రైతులు, ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

పాఠశాల వద్ద ముళ్లపొదల తొలగింపు



ఏర్గట్లలో ముళ్ల పొదలను తీయిస్తున్న కౌన్సిల్ సభ్యులు

ఏర్గట్ల, జూలై 13 : మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శనివారం సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులైన జిల్లా డైరెక్టర్ కట్కం శామంత్ రెడ్డి మాట్లాడతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ తమ దృష్టికి తీసుకురావడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ముళ్ల పొదలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఛైర్మన్ నరేష్, కార్య దర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

జన్నేపల్లి మాటు కాలువకు బుంగ



బుంగ పడిన మాటుకాలువ

నవీపేట, జూలై 13 : జన్నేపల్లి మాటు కాలువకు ఇటీవల బుంగ పడిందని స్థానికులు తెలిపారు. స్థానిక జీరోపాయింట్ వద్ద మాటుకాలువ మధ్యలో బుంగపడడంతో నీరు వృథాగా వెళ్తుందని, దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు పేర్కొన్నారు. మాటు కాలువ మధ్యలో పడిన బుంగను వెంటనే పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోస్రా, జూలై 13 : మండలంలోని చింతకుంట గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘం చింతకుంట గ్రామ సంఘంలో వర్ని ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో సీఎఫ్‌ఎల్‌లు స్వాతి, అరుణ్‌కుమార్‌లు ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలపై అకౌంట్, ఏటీఎం, పీఎంజేబీవై వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏ హరీష, అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి శోభ, కోశాధికారి రాజశ్రీ, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, జూలై 13 : మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల నర్సయ్య (36) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. భూతగాదల విషయంలో అన్నదమ్ముళ్ళకు గొడవ జరుగగా తమ్ముడైన వరికుప్పల గంగాధర్ కట్టెతో తలపై కొట్టాడు. దీంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం



నియామక పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎడపల్లి, జూలై 13 : సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తామని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా అధ్యక్షులు హన్మాగౌడ్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం ఎడపల్లి మండల సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షులుగా మంగల్‌పాటి లింగంకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన న్యాయచట్టాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ నారాయణ, జిల్లా అధ్యక్షులు రాజేందర్, జిల్లా ప్రధానకార్యదిర్శి ప్రసాద్, బోధన్ నియోకవర్గ చైర్మన్ జీవన్, గోపాల్ తదితరులున్నారు.

ఎస్సై మృతికి కారకులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

● అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు



మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న దళిత యువ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి మండల అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి సంతాపంగా మౌనం పాటించి నివాళి అర్పించారు. మానసికంగా వేధించి మరణానికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, గుర్రం నరేష్, లెక్చరర్ సాయన్న, నరేందర్ కేకే, పాలెపు చిన్నగంగారాం, పత్రిరవి, బండి అంజనేయులు, బాబూరావు, సన్ని, శైలేందర్, దిలీప్, అనిల్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

నవీపేట, జూలై 13 : మండల కేంద్రంలోని తడగామకు చెందిన పింకు (29)అనే యువకుడు జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. పింకు అంత్యక్రియలను శనివారం నవీపేటలోని తడగామలో నిర్వహించారు. బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో 'మీ కోసం మేము' అనే సేవా సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మోహన్, నవీన్‌రాజ్, మహిపాల్ తదితరులున్నారు.

సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



కోటగిరిలో మాట్లాడుతున్న మాజీస్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, జూలై 13 : కాంగ్రెస్ పార్టీలో పని చేసిన నాయకులకు తగిన గుర్తింపును ఇస్తూ అందరి సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తానని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం ఆయన పర్యటించారు. పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. గతంలో హెగ్డోలి శంకర్‌కు తగిన ప్రాధాన్యత కల్పించి ఎంపీపీ, జడ్పీటీసీగా, సర్పంచ్‌గా అవకాశం కల్పించామన్నారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సిరాజ్ పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం 91 కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, 22మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందుకు సాగుదామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ ఎలాంటి కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారంభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శంకర్ పటేల్, హెగ్డోలి శంకర్, నాయకులు ఏజాజ్ ఖాన్, షహీద్, మనోహర్, శాంతేశ్వర్ పటేల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ముప్కాల్, జూలై13: ముప్కాల్ మండల కేంద్రంతో పాటు వేంపల్లి, కొత్తపల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ముప్కాల్ మండలానికి చెందిన బోట్లరవి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, బద్దం సాగర్, జైడి సంద రవి, జక్క రాజేశ్వర్, జక్క గంగాధర్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి విజయ్, మల్‌రెడ్డి, ముస్కు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై యాసిర్‌అర్ఫాత్

● బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫత్

ముప్కాల్, జూలై 13 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫత్ సూచించారు. శనివారం మండలంలోని నాగాపూర్, బస్సాపూర్ గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలను సారం ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండవద్దని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు



కూల్చివేసిన అక్రమ నిర్మాణం

నవీపేట, జూలై 13 : మండలంలోని స్టేషన్ ఏరియాలో గల ఇరిగేషన్ కార్యాలయం స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని శనివారం అధికారులు కూల్చివేశారు. స్టేషన్ ఏరియాకు చెందిన అఫ్రోజ్‌ఖాన్ తన ఇంటి పక్కనే ఖాళీగా ఉన్న ఇరిగేషన్‌స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణంపై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శనివారం తెల్లవారుజామున ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్, ఎస్ఐ యాదగిరి గౌడ్, పంచాయతీ కార్యదర్శి నవ్యశీల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ బలరాం మాట్లాడుతూ మండలంలో ఇరిగేషన్‌కు సంబంధించిన కాలువలు, చెరువులకు చెందిన స్థలాలను పలు చోట్ల ఆక్రమణకు గురైనట్లు తమకు సమాచారం ఉందని, అటువంటి వాటిని నిర్ధాక్షన్యంగా తొలగించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వస్థలాలను కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అక్రమ నిర్మాణం తొలగింపు సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోటగిరిలో పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం వాహనాన్ని పట్టుకున్న అధికారులు

కోటగిరి, జూలై13 : మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్లులో శనివారం తెల్లవారుజామున పీడీఎస్ బియ్యాన్ని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిఖిల్‌రాజ్, ఎస్ఐ సందీప్‌లు కలిసి పట్టుకున్నారు. ఐచర్ వాహనంలో తీసుకువచ్చిన బియ్యాన్ని అన్‌లోడింగ్ చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. సుమారు 78.84క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. బియ్యం విలువ 1,25,360 రూపాయలు ఉంటుందన్నారు. మహారాష్ట్ర నుంచి ఐచర్ వాహనంలో పీడీఎస్ బియ్యం సరఫరా అవుతుందని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. వాహనం లోపలికి వెళ్లగానే అన్‌లోడింగ్ చేస్తుండగా కోటగిరి ఎస్ఐ సందీప్‌తో కలిసి డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పట్టుకున్నారు. అన్‌లోడింగ్ చేసిన బియ్యాన్ని తిరిగి లోడింగ్ చేసి ఇతర రైస్‌మిల్లుకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేశారు. 61వేల క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని తమ కస్టడీలోకి తీసుకుంటున్నామని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించారు.

కొడుకుతో కలిసి తల్లి అదృశ్యం

బోధన్‌రూరల్,జూలై13: బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రాంతానికి చెందిన బెలిడిగ మనీషా అనే మహిళ తన 3సంవత్సరాల కొడుకు గణేష్‌తో కలిసి శుక్రవారం వెళ్లి తిరిగి రాలేదని భర్త రమేష్ ఫిర్యాదులో పేర్కొనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మనీషా తన కుమారుడితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అదృశ్యం అయిన మహిళ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

బోధన్‌కు చెందిన వ్యక్తికి వైద్యరత్న అవార్డు

బోధన్‌రూరల్,జూలై13: బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన డాక్టర్ అశోక్ సూర్యవంశీ అనే వ్యక్తి హైదరాబాద్‌లో సంజీవన్ నేత్రాలయ ఫౌండర్‌గా విశేష సేవలు అందించినందుకు గాను తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం కూరుగంటి కళాక్షేత్రంలో వైద్యరత్న అవార్డును అందజేశారు. వైద్యరత్న అవార్డును అందుకున్న డాక్టర్ సూర్యవంశీని శ్రీరామదాసు పదితరం వారసులు కంచర్ల శ్రీనివాస్ తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఎస్టీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

ఆర్మూర్‌టౌన్ , జూలై13: ఆర్మూర్ పట్టణంలో ఎస్టీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ అన్నారు. శనివారం పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినిలు ఎస్టీ బాలికల హాస్టల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్‌చార్జీలు చెల్లించి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, డివిజన్ కన్వీనర్ పల్లపు శ్రావణ్, వరప్రసాద్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జూలై13: బాల్కొండకు చెందిన సల్లావుద్దీన్ అనే వ్యక్తి గత నెల పోగొట్టుకున్న ఫోన్‌ను శనివారం ఎస్సై యాసిర్ అరాఫత్ అందజేశారు. బాధితుడు గత నెల ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాల్కొండ పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రెస్ చేసి ఆచూకి తెలుసుకున్న అనంతరం తిరిగి ఫోన్‌ను బాధితుడికి ఎస్సై యాసిర్ అరాఫత్ అందజేశారు.

అర్హులందరికీ రుణాలు : ఐకేపీ డీపీఎం



ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో ఈడీపీ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు

డిచ్‌పల్లి, జూలై 13 : వ్యాపారం చేయాలకునే మహిళా అభ్యర్థులకు ఈడీపీ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రుణాసదు పాయం కల్పిస్తామని ఐకేపీ డీపీఎం సాయిలు అన్నారు. శనివారం డిచ్‌పల్లి ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో ఈడీపీ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డీపీఎం సాయిలు మాట్లాడతూ.. మహిళా సంఘాలు స్కూల్ డ్రెస్సులు కుట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, అన్ని మండలాల నుంచి స్కూల్ యూనిఫాంలు కుట్టి ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ఈడీపీ శిక్షణ పూర్తిచే సుకున్న వారందరికీ ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు శిక్షణ ఎంతో దోహదం చేస్తుందని, ఇప్పటి వరకు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో మహిళాసంఘాల ప్రతినిధులు రుణసదుపాయం కోసం అడగలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్, భాగ్యలక్ష్మీ, రామ్మకృష్ణ, రంజిత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జూలై 13 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు కొండపై చేరుకొని కొండపై చుట్టు భక్తులు కలిసి ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు

బోధన్‌రూరల్, జూలై 13 : బోధన్ పట్టణంలో రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలకు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందించి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని అనాథ మృతదేహాలు లభ్యం కావడంతో ఎవరూ రాకపోవడంతో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో పోలీసు, మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో దహన సంస్కర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్యసమాజ్ ప్రతినిధులు ప్రదీప్‌గుప్తా తెలిపారు.

విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన



వరినాటు విధానాన్ని పరిశీలిస్తున్న కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, జూలై 13 : పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు శనివారం పంటల సాగు, వరినాట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నర్సింగ్‌పల్లిలో ఇందూర్ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం పంటల సాగువిధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వరినాట్లు వేయడం, కానుక పంటల తయారయ్యే విధానం, చెరుకు పంటసాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్‌మినాజ్, డైరెక్టర్‌లు నాగేశ్వర్‌రావు, విజయ్‌కర్ణన్, మోసీన్‌చాబ్రి, తదితరులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



నాగంపేట్‌లో ఇళ్లల్లో నిల్వనీటిని తొలగిస్తున్న సిబ్బంది

ముప్కాల్, జూలై 13 : మండలంలోని నాగంపేట్ గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సుకన్య గ్రామంలో ఇంటింటికి వెళ్ళి కులాయిల్లో, కూలర్‌లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమలువృద్ధి చెంది లార్వ పెరుగుతుందని, ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న నీటి తొలగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్రెటరీ గౌతమి, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆదివాసి నాయకపోడు కులస్తులు

ముప్కాల్, జూలై13: ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సంగెం ముత్యం ఇటీవల 15 రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ఆదివాసి నాయకపోడు కులస్తులు, ఉద్యోగ సంఘాల సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగెం ముత్యంకు రూ.21వేల 500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, కార్యదర్శి సాయన్న, లోలం గంగాధర్, మెట్టు రాజేశ్వర్ పుట్ట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



క్షత్రీయ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆర్మూర్‌రూరల్, జూలై 13 : మండలంలోని చేపూర్‌లో గల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ రహిత కళాశాలగా మార్చాలని, ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు, క్యారి బ్యాగులను తొలగించి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి వెంకటేష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

కోటగిరి, జూలై 13 : మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసే సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. దోమల యొక్క లార్వాను చూపెడుతూ వాటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతినిత్యం శుభ్రమైన నీటిని సేవించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పొడి దుస్తులు వేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్మ సమస్యలు, దురదలు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు నరహరి, కల్పలత, సూపర్‌వైజర్ జ్యోతి, శ్రీదేవి, సంగీత తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి వసతి గృహంలో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి



మాట్లాడుతున్న ఓమయ్య

'బినామీలపై ఉన్న ఏజెన్సీలను రద్దు చేయాలి'

పెద్దబజార్, జూలై 13: ఒకే వ్యక్తికి బినామీల పేర్లపై ఉన్న మధ్యాహ్న పథకం ఏజెన్సీలను రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శనివారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నభోజన పథకంలో నిజామాబాద్‌లో ఒకరిద్దరు వ్యక్తులు బినామీల పేర్ల మీద పదుల సంఖ్యలో ఎక్కువ మంది పిల్లలు చదివే స్కూళ్లను మధ్యాహ్న భోజనఏజెన్సీ పేరుతో తీసుకొని భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఏ స్కూల్‌లో వంట ఆ స్కూల్‌లోనే చేయాలని నిబంధన ఉన్నా ఒకే దగ్గర వంట చేసుకొని వారికి సంబంధించిన స్కూళ్లకు భోజనాలను సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈవిషయంపై ఏఐటీయూసీ అనేకమార్లు జిల్లాఅధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. డీఈవో ఇప్పటికైనా శ్రద్ధ వహించి జిల్లాలో బినామీ వ్యక్తుల పేరు మీద నడిచే మధ్యాహ్న భోజనం ఏజెన్సీలను రద్దుచేసి అర్హులైన వారికి అప్పచెప్పాలన్నారు. మధ్యాహ్నభోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ ఒకరిద్దరు అవలంబిస్తున్న చర్యల వల్ల ప్రభుత్వానికే కాకుండా మధ్యాహ్న భోజన కార్మికులందరికీ చెడ్డ పేరు వస్తుందని అన్నారు. నాణ్యమైన బియ్యం, కోడిగుడ్లు, వంట సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించడంతో పాటు స్లాబ్ రేట్‌ను పెంచిఅమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రూ.10వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హన్మాండ్లు, ఆనంద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

'వక్ఫ్ భూముల పరిరక్షణకు కృషి చేయాలి'

ఖిల్లా, జూలై, 13: జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డుకు చెందిన భూములను పరిరక్షించేందుకు కృషిచేయాలని జైమతుల్ ఉల్మా జిల్లా ప్రధానకార్యదర్శి మౌలాన అబ్దుల్ ఖయ్యూమ్ షాకిర్ వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లా ముస్సెనిని కోరారు. చైర్మన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీల సంక్షేమంపై పలు విషయాలను చర్చించారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ధర్పల్లి, జూలై13: మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన వాల్గోట్ మానిక్యం (43) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ శనివారం తెలిపారు. దుబ్బాక గ్రామానికి చెందిన మానిక్యంకు 12 ఏళ్ల క్రితం గంగామణితో వివాహమైంది. 12 ఏళ్లయినా సంతానం కలగలేదని బాధపడుతూ మద్యం సేవించేవాడని ఎస్సై పేర్కొన్నారు. నెలరోజుల క్రితం భార్యతో గొడవ పడటంతో భార్య గంగామణి పుట్టింటికి వెళ్లింది. అప్పటి భర్త ఒక్కడే ఇంటివద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

'ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు'

పెద్దబజార్, జూలై13: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేయద్దని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత గిరిజనుల మీద దాడులను, అత్యాచారాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో ఎంతో పోరాటం తర్వాత ఏర్పడ్డ ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కొద్ది మంది తమస్వార్థం కోసం వాడుకుంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని అన్నారు. వారి వల్ల చట్టానికి ఉన్న గౌరవం పోతుందని స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాల కక్ష కోసం ఇంత గొప్ప చట్టానికి ఉన్న విలువ తీయవద్దని హితవు పలికారు. ఈనెల 15న వరంగల్‌లో రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ మాదిగ, భవానిరెడ్డి, దగ్గుపాటి రాజు, చంద్రం, నాగమణి, గోపి, రవికుమార్, రాజు, ఎంఎస్ఎఫ్ నాయకులు సంజయ్, రజిని పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

పెద్దబజార్, జూలై13: నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసెన్‌జిత్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఏ రద్దు చేయాలని, తెలంగాణలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని అన్నారు. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడుతామన్నారు. బిహార్ పాలింగంజ్ ఎమ్మెల్యే సందీప్ సౌరవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐసాను బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమేష్, రాజు, ఉదయ్‌కిరణ్, కిరణ్‌కుమార్, సాగర్, జ్వాలా, వివిధ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసెన్‌జిత్





వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

కుండీలో నుంచి మురికి నీరును తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం!

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తతపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- ఆరోగ్య సూచనలు ఇస్తున్న వైద్యులు

రుద్రూరు, జూలై 13: వానాకాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే పలుచోట్ల దోమలతో డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, బోధకాలు వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. కలుషిత నీటి వల్ల డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ వ్యాధులు సోకుతాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తచెదారం తొలగించాలని, పాత టైర్లు, పగిలిన సీసాలు, కుండలు, పాత టైర్లలో నీరు నిలువకుండా చూసుకోవాలని, వీలైతే వాటిని బయట పడేయాలని సూచిస్తున్నారు. కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాటి బారిన పడ్డవారు జ్వరం, వాంతులు, విరేచనాలు అవుతాయి.

• వైరల్ ఫీవర్ రావడానికి కారణాలు..

వైరల్ ఫీవర్ ఒకరి నుంచి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు కూడా వైరల్ పీవర్ విజృంభిస్తుంది.

• లక్షణాలు

వైరల్ ఫీవర్‌తో బాధపడేవారిలో జ్వరం, ఒళ్లునొప్పులు, నీరసం, ఒంటిపై దద్దుర్లు, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతు నొప్పి, ముక్కు రావడం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

• వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటిని, ఇంటి పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి వేడి ఆహారం తీసుకోవాలి. తాజా పండ్లను తీసుకోవాలి. దోమతెరలను వాడాలి. కిటికీలకు తెరలను ఏర్పాటు చేసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

• బయట ఆహారం తీసుకోవద్దు

బయట ఆహారం అస్సలు తీసుకోకూడదు. ముఖ్యంగా పానీపూరి, జంక్‌ఫుడ్ అస్సలు తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• అయేషా సిద్దిఖా, వైద్యాధికారిణి, రుద్రూరు



ఇంటిని, ఇంటి పరిసరాలను పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అప్పుడే వ్యాధులు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ. కాచి చల్లార్చిన నీటిని తాగడం ఉత్తమం. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఇంట్లోకి ఈగలు, దోమలు రాకుండా తగిన జాగ్రత్తలను తీసుకుంటే రోగాలు దరిచేరవు.



సెల్‌ఫోన్‌లను అప్పగించిన దృశ్యం

రూ.4లక్షల విలువ చేసే సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా, జూలై13: వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు శనివారం బాధితులకు 1వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సెల్‌ఫోన్ పోయిన విషయాన్ని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని సీఐఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి వాటిని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు బాధితులకు అప్పగించారు.

'సర్వీస్ రూల్స్ సాధించడమే పీఆర్‌టీయూ ధ్యేయం'

నిజామాబాద్‌అర్బన్, జూలై13: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు విజయవంతంగా నిర్వహించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో సీఎంను ఒప్పించి సర్వీస్ రూల్స్ సాధించడమే పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం ధ్యేయమన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనను ఢీకొన్న టిప్పర్

• త్రుటిలో తప్పిన ప్రమాదం

మోపాల్, జూలై 13: మండలంలోని రాణాకుర్తు బ్రిడ్జిని మొరం టిప్పర్ శనివారం సాయంత్రం ఢీకొట్టడంతో త్రుటిలో ప్రమాదం తప్పిందని అక్కడున్న స్థానికులు తెలిపారు. నర్సింగ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న మొరం టిప్పర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ముందరున్న ఆటోను తప్పించబోయి బ్రిడ్జిని ఢీకొనడంతో బ్రిడ్జి ధ్వంసమైంది. అక్కడున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని సిర్పూర్, మోపాల్, నర్సింగ్‌పల్లి గ్రామాల నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తూ అతివేగంగా టిప్పర్‌ను డ్రైవర్ నడుపుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా టిప్పర్ యజమానులు అతివేగంగా అతిజాగ్రత్తగా నడపవద్దని హెచ్చరిస్తున్నారు.

ముఖంపై కారం చల్లి.. మెడలోని చైన్ లాక్కెళ్లి..

• ఫకీరాబాద్‌లో చైన్‌స్నాచింగ్

నవీపేట, జూలై 13: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో శనివారం రాత్రి 8.30గంటల సమయంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. ఆర్మూర్ మండలం ఆలూర్‌కు చెందిన పుల్లెల కవిత తన తల్లి గ్రామమైన ఫకీరాబాద్‌కు శనివారం రాత్రి 8 గంటల సమయంలో వచ్చింది. అప్పుడే వచ్చిన కవిత కాళ్లు, చేతులు కడుక్కుని వాకింట్లో నిల్చోగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఇంట్లో ఎవరుంటారు.. ఎంతమంది సభ్యులు ఉంటారు అంటూ ఓ వ్యక్తి వివరాలు అడుగుతూ తన జేబులో నుంచి కారం పొడితీసి ఆమె ముఖంపై చల్లి మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు చైన్‌స్నాచర్‌ను వెంబడించినప్పటికీ దొరకలేదు. ఈ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

మార్కెట్ యార్డుకు రెండు రోజుల సెలవు

ఖిల్లా, జూలై13: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 15, 16తేదీల్లో వ్యాపార లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఈరెండు రోజుల పాటు యాదగిరిగుట్ట ప్రాంతాలను పర్యటిస్తున్నందున వారు వ్యాపారలావాదేవీలు ఆయా తేదీలో కొనసాగించలేమని మార్కెట్ యార్డు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి సోమ, మంగళవారాల్లో తమ ఉత్పత్తులను మార్కెట్‌యార్డుకు తీసుకొని రావద్దని ఆయన సూచించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

నిజామాబాద్‌రూరల్, జూలై13: రూరల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన తాటిపాముల శివప్రసాద్ గౌడ్ (45) చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో జి.మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన శివప్రసాద్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన భైరి నర్సాగౌడ్‌తో స్వల్ప విషయంలో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో శివప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో శివప్రసాద్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దాడికిపాల్పడ్డ నర్సాగౌడ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం శివప్రసాద్‌గౌడ్ మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో బోధనేతర సిబ్బంది ఖాళీల సవరించిన జాబితా

నిజామాబాద్ అర్బన్, జూలై13: జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలోని బోధనేతర ఉద్యోగులైన జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ వారి క్యాడర్ వైస్ ఖాళీల సవరించిన జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ డీఈవోనిజామాబాద్. ఇన్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించిన ఆప్షన్స్ ఫామ్‌లో ఏవైనా మార్పులు ఉంటే ఆసక్తిగల ఉద్యోగులు సవరించిన ఖాళీల జాబితా ప్రకారం రివైస్డ్ ఆప్షన్ ఫామ్‌ను జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో ఈనెల15న మధ్యాహ్నం 1గంటలోపు సంబంధిత పత్రాలతో హెచ్‌ఎంల ద్వారా ధృవీకరించి సమర్పించాలని ఆయన తెలిపారు.

డిగ్రీ వన్‌టైం బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్

డిచ్‌పల్లి, జూలై13: టీయూ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు శనివారం 12వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 44మంది విద్యార్థులకు గాను 41మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 96మంది విద్యార్థులకు 90పరీక్షకు హాజరయ్యారని, 6మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. గిరిరాజ్ కళాశాల కేంద్రంలో ఇద్దరు చూచిరాతలకు పాల్ప డుతూ డిబార్ అయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.


రైలు కింద పడి ముగ్గురి మృతి

- నిజామాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న హోంగార్డు
- ఇందల్వాయిలో గుర్తుతెలియని ఇద్దరి మృతి

ఖిల్లా, జూలై13: రైలు కింద పడి ముగ్గురు మృతిచెందిన ఘటన శనివారం జిల్లాలో వేర్వేరుచోట్ల చోటుచేసుకుంది. నిజామాబాద్ నగరంలో ఓ హోంగార్డు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా.. ఇందల్వాయిలో ఇద్దరు రైలు కింద పడి మృతిచెందారు. నిజామాబాద్ నగరంలో గుర్తు తెలియని రైలు కింద పడి హోంగార్డ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి కథనం ప్రకారం.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన సంపత్ (43)గా పోలీసులు గుర్తించారు. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉందని, పైగా అప్పులు పెరిగిపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం ఉదయం విధుల్లోకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి రైల్వేస్టేషన్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.




రైల్లో నుంచి పడి మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తులు



మృతుడు సంపత్ (ఫైల్)

ఇందల్వాయిలో ఇద్దరు..

ఇందల్వాయి: ఇందల్వాయి రైల్వేస్టేషన్ సమీపంలో నడుస్తున్న రైలు నుంచి కింద పడి ఇద్దరు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం స్టేషన్ సమీపంలో పట్టాల పక్కన డ్రైనేజీ వద్ద రెండు మృతదేహాలు ఉండటంతో స్థానికులు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్టేషన్‌మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. నడుస్తున్న రైల్లో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పడిపోవడంతో మృతి చెందారని అన్నారు. నడుస్తున్న రైల్లోంచి పడటం వల్ల వారికి తీవ్ర గాయాలై మొఖం చిట్లిపోయిందని తెలిపారు. మృతదేహాల వద్ద వివరాల కోసం పరిశీలించగా వారి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లభించలేదని వీరిని గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతదేహాలను నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని మార్చురికి తరలించామని మృతదేహాలను మూడు రోజుల పాటు అక్కడే ఉంచుతామని సంబంధికులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఎవరూ రాకపోతే అనాధ శవాల కింద అంత్యక్రియలు నిర్వహిస్తామని అన్నారు. ఘటన స్థలానికి ఎస్సైతోపాటు కామారెడ్డి రైల్వే ఎస్సై సాహునాయక్, హెడ్‌కానిస్టేబుల్ నగేష్, కుబేరుడు, క్రాంతి, ఐలయ్య తదితరులు ఉన్నారు. మండల కేంద్రంలోనే ఈఘటన చోటుచేసుకోవడంతో ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ వెళ్లి పరిశీలించారు.

'కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి'

పెద్దబజార్, జూలై13: మోటారు రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం నగరంలోని ద్వారకనగర్‌లోగల ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఈనెల21న జరిగే మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ఇల్లెందులో జరిగే మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25లక్షల మంది మోటార్‌రంగ కార్మికులు ఉన్నారని ఆయన తెలిపారు. 2019లో నరేంద్రమోదీ ప్రభుత్వం రోడ్ సేఫ్టీ బిల్లు పేరుతో మోటార్ రంగ కార్మికుల నోట్లో మట్టి కొట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. యాదృచ్ఛికంగా ప్రమాదాలు జరిగితే దానికి పూర్తిబాధ్యత డ్రైవర్‌ను చేసి రూ.10లక్షల జరిమానాతోపాటు జైలు శిక్ష లాంటి కఠినమైన చర్యలకు మోదీ ప్రభుత్వం ఒడిగట్టిందని అన్నారు. మరోవైపు ఆర్టీవో అధికారులు ట్రాఫిక్, సివిల్ పోలీస్ అధికారులు బండికి ఫిట్‌నెస్ లేదని చిన్న కారణాలతో భారీగా పెనాల్టీలు విధిస్తూ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోకార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం మాటఇచ్చిందని గుర్తుచేశారు. మోటార్‌రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మురళి, ఆటో కార్మికుల నాయకులు నర్సయ్య, గంగారాం, తిరుపతి, నరేష్, జావెద్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.125	రూ.235	రూ. 255



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,600	రూ.67,800	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
  : కల్కి(హిందీ) (2.45, 10.15)
- స్క్రీన్-2 : భారతీయుడు-2 (11.15, 3.00, 6.45, 10.30)
- స్క్రీన్-3 : కిల్ (హిందీ) (12.15, 2.45, 9.00)
  : భారతీయుడు-2 (5.15)
- స్క్రీన్-4 : సర్ఫిరా (హిందీ) (12.20, 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : భారతీయుడు-2 (9.00, 12.30, 4.00, 7.25, 10.50)
- స్క్రీన్-2 : భారతీయుడు-2 (10.00)
  : కల్కి(తెలుగు) (1.30, 3.20)
  : కల్కి(3డి తెలుగు) (6.45)
- స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (10.30, 1.30, 3.20, 7.00, 10.40)

- దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : భారతీయుడు-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్